'ప్రేమూ పెండ్లి'

"మనుమరాలు పుట్టిందన్న ఆనందంతోపాటు జన్మనక్షత్రం మంచిది కాదన్న అదటుకూడా జనించింది మా అమ్మకి. నరసింహంగారిని కనుక్కుంటె అమ్మమ్మ గండం అని చెప్పాడేమో అని తోస్తోంది. పోనీ, పెద్దది కదా...ఆవిడ చెప్పినట్లు పీటలమీద కూర్చుని ఆ కాస్త శాంతీ అయిందనిపించకూడదూ?" అంది బాలెంతరాలైన సౌభాగ్యమ్మ మొగుడుతో.

"నీక్కూడా పిచ్చేనా ఏమిటి? బ్రహ్మిగాళ్ళు మేకల్లా అరుస్తూంటే ఆ పొగలో ఘంటలు తరబడిని, ఎందుకోసమో తెలియకుండా ఎందుకూ పీటలమీద కూర్చోడం? మీ అమ్మకేమీ భయంలేదులే!"

"పీక్కుతింటూన్న అనుమానాన్ని నివారణ చేసుకోడానికే పీటల మీద కూర్చోడం."

"అల్లాగైతే, రోజూ లక్ష అనుమానాలుంటూనే వుంటాయి. అవన్నీ నివారిస్తూ కూచోడమేనా మనపనీ? తొలిచూలు పిల్లగనక ఆనందంగా కావలిస్తే మన ఊరువెళ్ళాక నలుగుర్నీ ఎరుగున్నవాళ్ళని పిలిచి, ఓ టీపార్టీ ఇద్దాం."

"మనం ఊరువెళ్ళాక సరే మీరు చెప్పినట్లు చెయ్యవచ్చు. కాని ఓ మాటు పీటలమీద కూర్చుని క్రొత్తబట్టలతో లేస్తే మా అమ్మ చూసి ఆనందిస్తుంది. పనిలోపని నామకరణంకూడా చేసెయ్యొచ్చు. మావాళ్ళు ఎరుగున్న నలుగుర్నీ భోజనాలకి పిలుచుకుని ఆనందిస్తారు."

"నామకరణాని కిక్కడ శాంతి చేసుకోక్కర్లేదు. అవధాన్లకి కట్నం ముట్టచెప్పి, బియ్యంమీద అక్షరాలు వ్రాస్తేనేకాని నామకరణం అవదా ఏమిటి? ఆ టీపార్టీనాడే రంగయ్యనాయుడుగారిచేత ఒక ప్రార్థన చేయించి, పేరు పెట్టించొచ్చు."

పురుషోత్తం ముఖంకేసి ఓ చూపు చూసింది సౌభాగ్యమ్మ. వాదించడంవల్ల ప్రయోజనం లేదని ఊరుకుంది.

మరునాడు పురుటిశుద్ధి. పురుషోత్తం "భాగ్యం, ఇవాళ ఇంట్లో కాఫీ కాచడానికి తీరుబడి లేనట్లుగా ఉంది. హోటలుకు పోయొద్దునా?" అన్నాడు.

"ఇల్లారండి ఒక్కమాటు" అని వినపడింది సౌభాగ్యమ్మ కంఠస్వరం. పురుషోత్తం లోపలికి వెళ్ళేడు. సౌభాగ్యమ్మ అగుపించలేదు అతనికి మొదట. ఎర్రశాలువా తెరగా అటొహాడూ ఇటొహాడూ పట్టుకుని భావమరదులిద్దరూ నిలబడ్డారు. నూనెతో నిండిన మూకుడొకటుంది దక్కడ.

పురుషోత్తం మాట్లాడలేదు. "పీటమీద కూర్చుని ఒక్కమాటు నూనెలో చూడండీ" అంది సౌభాగ్యం. "నాన్ సెన్స్" అన్నాడు పురుషోత్తం అవమానించ బడినవాడిలా. భావమరదుల ముఖాల్లో రక్తం లేదు. సీతమ్మగారు అల్లుడికి అగుపించకుండా ప్రక్కకు తప్పుకుంది. "అదిగో, ఇదుగో, అమ్మాయిని చూడండీ నిద్రలో ఎల్లా నవ్వుతోందో. త్వరగా! త్వరగా చూడండీ!" అంది సౌభాగ్యం. పురుషోత్తం అప్రయత్నంగా పీటమీదికి మోకాళ్ళపైని వంగేడు. అతనికి ప్రతిబింబం అగుపడింది. "ఉత్తది నవ్వూలేదు ఏమీలేదు!" అన్న మాటలు వెలువడ్డాయి అతని నోటమ్మట. తెర లాగేశారు మరదులు. "అస్తమానూ నవ్వుతోనే ఉంటుంది. ఈమాటు చూపిస్తా!" అని సౌభాగ్యమ్మ పిల్లని తీసుకుని పీటమీదనుంచి లేచింది.

౨

పురుషోత్తం దగ్గరనుంచి ఉత్తరాలమీద ఉత్తరాలొస్తున్నాయి. సౌభాగ్యమ్మనీ పిల్లనీ పంపమని. పురుటి శుద్ధినాడే తల్లీ పిల్లలను తీసుకు వెడదామని వచ్చాడు. సీతమ్మగారప్పుడు "పువర్జన్మ ఎత్తింది. నాలుగు పథ్యాలు వంటపట్టాక తీసుకువెడుదుగాని" అంది. 'వీల్లేద'ని కొంచెం పట్టు పట్టాడు. కాని సౌభాగ్యమ్మ "నే నిప్పుడొస్తే మీ హస్తపాకం చూపించవలసొస్తుందేమో!" అనే చిన్న సమస్యను వదిలెయ్యడంవల అత్తగారిమాట తీసివెయ్యకుండా వెళ్ళాడు పురుషోత్తం అప్పుడు. మూడోనెల రావడం

తోనే మంచిరోజు చూసి, సీతమ్మగారు సౌభాగ్యమ్మని ప్రయాణం చేసింది. బండి ఎక్కుతూంటే, ఆ యిల్లాలు కూతురుదగ్గరకొచ్చి, నిమ్మళంగా "అమ్మడూ, ఆ తొమ్మిదో రోజున నీకు వచ్చిన దడ చూసి హడలి పోయాను. ఆ వెంకటరమణమూర్తి దయవల్ల బ్రతికావు. ఉపేక్ష చెయ్యక తిరుపతి వెళ్ళి మొక్కు చెల్లించుకోండి" అంది "అల్లాగే నమ్మా" అంది సౌభాగ్యమ్మ. "గుళ్ళో దేవుడని కొలిచే రాతికీ, గుమ్మంక్రింద మెట్టుగా ఉపయోగించే రాతికీ భేదమేమీలేదనే భర్తగారు తిరుపతి ప్రయాణాని కొప్పుకుంటారా ?" అని మనస్సులో ఆమె అనుకుంటుండగానే, అన్న పద్మనాభం "పోనియ్ బండి" అన్నాడు. చక్రాలు కదిలిపోయాయి. సీతమ్మగారికి కన్నీరడ్డమైంది. "చంటిపిల్లతో సుఖంగా అది వెడుతూంటే కంటతడి కూడ"దని చెంగుతో కళ్ళొత్తుకుంటూ సీతమ్మగారు లోపలికెళ్లి పోయింది.

3

ఇన్విటేషను కవర్లమీద ఎడ్రసులు రాయడం ముగించి, అతిథుల లిస్టుతోపాటు వాటిని నౌకరు కుర్రవాడికిచ్చి, పురుషోత్తం వంటింటి దగ్గర కొచ్చాడు.

"నీ ఉద్దేశమేమిటో తేల్చావుకాదు" అన్నాడాతడు భార్యతో.

"దీనికింత ఆలోచనెందుకండీ మీ అమ్మగారి పేరు పెట్టక ?" అంది తొలిచి పట్టుకొచ్చిన పెద్ద సత్తుగిన్నెలో పెరుగుపోస్తూ, ఆమె.

"మీ అమ్మపేరే పెడదాం" అని నాచే అనిపించడానికి కాబోలు ఇల్లా అనడం ?"

"కాదండీ మా అమ్మపేరు ఎల్లాగా పెట్టమనను మా అమ్మ పేరు కంటే ముందుగా చచ్చి స్వర్గస్థురాలైఉన్న అత్తగారి పేరు పెట్టాలి. అది లోకాచారం. ముందు ముందు అవకాశముంటే మా అమ్మ పేరెల్లాగా పెడతాం."

"సింగినాదం. లోకాచారమేమిటి ? ప్రతిదానికీ 'ఆచారం ఆచారం' అంటావు."

"ఆచారంమాట అల్లా ఉంచండి. పెద్దవాళ్ళపేరు పెట్టడం ఉందే వాళ్ళమీదఉన్న ప్రేమ, గౌరవం తెలియచెయ్యడం అన్నమాట."

"మా అమ్మపేరు పెట్టకపోతే ఆవిడమీద గౌరవం లేదన్నమాటేనా ఏమిటి? పేరు పెట్టినంత మాత్రం ఊహూ—ప్రేమ, గౌరవం కారిపోతాయి కాబోలు!"

"సరే, అల్లాగయితే ఏదో ఆలోచించి పెట్టెయ్యండి."

"ఇంతకంటే ఏమీ తోచలేదన్నమాట."

"నే నేమిచెప్పినా మీకు నచ్చదు...పోనీ పార్వతీదేవి పేరో, లక్ష్మీదేవిపేరో పెడితే?"

పురుషోత్తం ఆలోచించాడు. "పార్వతి" అనేది మూడక్షరాల పదం. రెండక్షరాలకంటె ఎక్కువ ఫేషన్ కాదు. "లక్ష్మి" అంటే బాగుంది. కాని పేరు క్రమంగా "లచ్చమ్మ" అని వాడుకలోకి వస్తుంది. "ఇందిరా లోకమాత మా రమా మంగళదేవతా" ఇందులో రెండక్షరాలమాట "రమ" కాని ఇంతకీ "లక్ష్మి" అనే అర్థం రావాల నెక్కడుంది? ఇంకా లక్ష పేర్లున్నాయి. "ఉమా కాత్యాయనీ గౌరీ కళ్యాణి సర్వమంగళా!" "వాణి" కూడా మంచిపేరే...ఇల్లా అనుకుంటూ చటుక్కుని అనుకుంటూన్నదాని విమర్శించుకున్నారు. "ఇదేమిటి తెలివితక్కువ? దేవతలపేర్లే పెట్టాలనుకోవడమేమిటి? ఇదొక మూఢాచారానికి వశం అవడమన్నమాట" అందుచేత ఆ తలంపు మారిపోయింది ఆయనలో. "సావిత్రి, చంద్రమతి, లోపాముద్ర, సుకన్య..." ఈ జాబితా ఏకరువు పెట్టుకున్నాడు. ఈపేర్లన్నీ పెద్దవిగానే తోచాయి. అంతేకాకుండా, ఈపేర్లు పెట్టడంలో అర్థమేమిటి? వాళ్ళంతా ఆదర్శ స్త్రీలనా? వీళ్ళంతా పుక్కిటి పురాణాలలో వాళ్ళేగా. ఆ చరిత్రలు యథార్థం అవుతేగా అల్లాంటి స్త్రీలున్నారనుకోడానికి? "సుశీల, సరోజిని"...పోనీ, "ఝాన్సీ" ఎల్లాగుంటుంది? ఫస్టుగా ఉంటుంది. కాని ఈ పేరు చాలామంది పెట్టేశారు...ఎన్నివిధాల ఆలోచించినా ఆలోచించినా పురుషోత్తమానికి కూతురుకి ఏ పేరు పెట్టాలో తేలిందికాదు. "నీ మొహం నిన్నేమి సలహా అడిగినా యింతే..." అంటూ పైకి వెళ్ళాడు ఆ యజమాని.

వేదవేదాంగాలు శాస్త్రాలు చదివి, ఘోరమైన తపస్సుకూడా చేసి, విఫల మనోరథుడైన సిద్ధార్థుడు తుదకు అశ్వత్థవృక్షం క్రిందకు వచ్చి బుద్ధ

డైనట్లు, పురుషోత్తం, వంటింటిదగ్గర మెదడుతో ఎంతో కుస్తీపట్టి లాభం లేక మిద్దెమీదికెళ్లి ఒక్క నిమిషం ఆలోచించి సిద్ధార్థుడయ్యాడు. కొలంబస్ అమెరికాను కనిపెట్టినప్పుడు అతడు పొందిన సంతోషానికి రెట్టింపు ఉల్లా సంతో గబగబా క్రిందకొచ్చి "భాగ్యం!" అన్నాడు పురుషోత్తం.

"ఏమండీ?"

"మన అమ్మడు మూర్తీభవించిన మన అన్యోన్యానురాగం. దీనికి "ప్రేమ" అని పేరు పెడదాం. "ప్రేమా" అని పిలుచుకోవచ్చులే. ఊఁ?"

సౌభాగ్యమ్మ తలెత్తకుండానే, "బాగానే ఉందండి" అంది.

సౌభాగ్యమ్మ "అనెడ్యుకేటెడ్" అయినా తాను చెప్పిన వచనాల్లో ఉండే పరమార్థాన్ని సూక్ష్మంగా గ్రహించగలిగినందుకు సంతోషిస్తూ పురుషోత్తం సంతృప్తి గనపరిచాడు.

౪

పురుషోత్తం భోజనం చేస్తున్నాడు. "ఏమండీ?"అంది సౌభాగ్యం.

"ఏం?"

"ఉత్తరం వచ్చింది మావాళ్ళ దగ్గరనుంచి చూశారా?"

"లేదు. ఏమిటి విశేషాలు?"

"మా రామానికి కార్యమట."

"ఊహూ!"

పురుషోత్తం మాట్లాడకుండా భోజనం చేస్తున్నాడు. కర్తవ్యం ఎరుగున్నది గనుక సౌభాగ్యం "మనల్ని అందర్నీ బయలుదేరి రమ్మన్నారు" అంది.

"అందుచేత ఇప్పుడు బయలుదేరుతానంటావేమిటి?"

"వెళ్ళక్కర్లేదు మరి? మావాళ్ళ యింట్లో ఇక యిప్పట్లో జరిగే శుభకార్యం ఏమీలేదు."

"రైళ్ళమీదా, పడవలమీదా ఈ వేసవికాలంలో వ్యయప్రయాసలతో ఎందుకంత దూరం వెళ్ళడం?"

"వ్యయప్రయాసలని ఊరుకుంటే బాగుంటుందా? వెళ్ళకపోతే ఎల్లాగ? చెల్లెలి కార్యం అవుతోన్నప్పుడే వెళ్ళకపోతే ఇంకెప్పుడు పుట్టింటికి వెళ్ళడం?"

"మీ చెల్లెలి గర్భాదానానికి నువ్వెందుకూ? మనలో ఉండే గొప్ప "న్యూసెన్సు" ఇదే. ఒక పిల్లకి శోభనం అవుతూంటే పదిమందీచేరి పాడా విడిచేసి నానాగల్లంతూ చెయ్యడం దెబ్బలాడుకోవడం... ఇంతకీ ఇప్పుడిప్పుడే స్కూలుకు వెళ్ళిరావడం అలవాటవుతోంది ప్రేమాకి. ఇప్పుడు దాన్ని తీసుకుపోతే "ఇదిగో అదిగో" అని ఎల్లాగైనా తిరిగి రావడానికి పదిహేను రోజులు పడుతుంది. ఈ పదిహేనురోజులూ అడ్డగాడిదల్లాగ తిరిగే ఆ పిల్లలతో కలుస్తే ఇంక దానికి స్కూలుమాట చెప్పక్కర్లేదు"

"దూరాన్ని పడున్నాము. ఎప్పుడో ఇల్లాంటి సందర్భాల్లో తప్ప ఇల్లు కదలడమే పడదు. ప్రేమా పుట్టిన తర్వాత ఏ శుభకార్యం నే చూడేలేదు. అల్లాంటి సరదాలేమీ తీరలేదు."

"శుభకార్యాలు చూడ్డం సరదా అవుతే, నాయుడుగారి తమ్ముడు కూతురి పెళ్ళిట. ఇన్విటేషనొచ్చిందప్పుడే. దగ్గరకూడాను. వెళ్ళిరా."

"చెల్లెలికి శోభనం అవుతే వెళ్ళడం మానేసి, నాయుడుగారింటో నేనాకాదు, ఆయన తమ్ముడింట్లో పెళ్ళికా వెళ్ళడం?" అనుకుంది మనస్సులో సౌభాగ్యం.

"ఆయనకి దేవస్థానంలో పెద్ద ఉద్యోగం. పలుకుబడున్నవాడు. పెద్ద ఫాయాలోవాడు. కావలిస్తే నీ చాదస్తానికి సరిపడేట్లుగా టిఫినువగైరాలన్నీ నీకు బ్రాహ్మలింట్లోనే ఏర్పాటు జరుగుతుంది."

"దేవస్థానం" అనేటప్పటికి సౌభాగ్యమ్మకి వళ్ళు ఝుల్లుమన్నట్లు తోచింది. "తిరుపతి వెంకటరమణా, నీ దర్శనం చేయిస్తానని మా అమ్మ, ఈ పిల్లపుట్టినప్పుడు—అంటే అప్పుడే ఏడేళ్ళయింది — మొక్కుకుంది. నీ దర్శనభాగ్యం నే నెంత ప్రయత్నం చేసినా లభించలేదు. నే దప్రయత్నంగా నిన్ను చూసేమార్గం లభిస్తోంది."

"అప్పుడే కునికిపాట్లోస్తున్నా యేమిటీవేళ?" అన్నాడు పురుషోత్తం పరధ్యానంలో ఉన్న సౌభాగ్యాన్ని చూసి.

"దేవస్థానంలో పెద్ద ఉద్యోగం అన్నారు, ఏమిటండీ అది?"

"తిరుపతి దేవాలయానికి వచ్చే ఆదాయం, అయ్యే వ్యయం తెనిప్పే లెఖల్ని సరిచూడడం."

విగ్రహారాధనను దూషించే కుటుంబంలో వాడికి, వెంకటేశ్వర భగవానుని జమాఖర్చులు చూసే ఉద్యోగం అవడం కొంచెం అసభ్యంగా తోచిందామెకు.

"ఏమాటన్నానుకదా, అని తీసుకొనే ఇల్లా వేపుతున్నావు నన్ను. పెళ్ళి చూశాం. వచ్చిన పనయింది. సాయంత్రానికి ఇంటికెళ్ళకపోతే ఎల్లాగ? రేపు సోమవారం బడికదా ప్రేమూకి! పైగా నా ఆఫీసు" అన్నాడు పురుషోత్తం.

"క్రింద తిరుపతి కొచ్చినవాళ్ళు కొండమీద కెళ్ళకుండా పోతారా ఎవరైనా? ఇది వేపడమా?"

"ఏడు మైళ్ళెక్కాలి. అందులో మోకాలి పర్వతంట! అదెక్కితే మజా తెలుస్తుంది."

"నడవలేకపోతే డోలీలు కట్టించుకోవచ్చు?"

"బ్రతికుండగానే నరవాహనమా?"

"ఎప్పుడూ ఇలాంటిమాటలేనండీ మీరు? చెన్నపట్టణంలో, రిక్షాలెక్కి వెళ్ళేవాళ్ళే కాదూ చాలామంది? వాటికంటే తీసిపోయిందా ఏఁటి డోలీ?"

"అదుగో, వాదించండం అంటే ఘష్టు. ఆతర్కమే వద్దంట."

"వ్యవహారం చెడిపోతోం"దనుకుంది సౌభాగ్యమ్మ. "తర్కం కాదండీ, కొండమీద చూడవలసిన ప్రకృతి వైచిత్ర్యాలు చాలా ఉన్నాయిట! పాపనాశం అనేచోట ఒక జలపాతం ఉందిట! ఆ ప్రదేశం అంతా మనోహరంగా ఉంటుందిటండీ... నాకేం తెలుసు! ఇదంతా నాయుడుగారు ఎవరితోనో చెబుతోంటే విన్నా నిందాక."

"అల్లాగైతే వాళ్ళెవరైనా వెళుతూంటే వెళ్ళు. నేనుమాత్రం ప్రయాస పడదలచుకోలేదు. సాయంత్రాని కొచ్చెయి... జాగ్రత్త. నేనే

రైలులో వెడతాను. పోనీ ప్రేమానుకూడా తీసుకెడితేనేం నాతో రేపూ? ఎందుకూ స్కూలు చెడగొట్టడం?"

ఈ మాట వినేటప్పటికి సౌభాగ్యమ్మకి ఏమీ తోచిందికాదు. తాను రాకపోవడం సరిగదా, పిల్లనుకూడా రానియ్యనంటున్నాడు భర్త. "నేనూ వెడతాను అమ్మతో" అంది ప్రేమా. సౌభాగ్యమ్మకి ప్రాణాలు లేచొచ్చాయి. "సరే" అన్నాడు పురుషోత్తం బయలుదేరుతూ. "స్టేషనుకి కారు పంపడం మరచిపోకండి" అంది సౌభాగ్యం.

పాపనాశనం జలధారదగ్గరున్న ప్రకృతివైచిత్రాలు చూడడానికి బయలుదేరినవాళ్లతో బాటు, సౌభాగ్యం, ప్రేమా వెళ్ళారు కొండమీదికి. ఆలయప్రాంతాలకు జేరుకున్నాక, సౌభాగ్యమ్మ "ఏమిటో అనుకున్నా! బడలికగావుంది. ఈ సత్రములో విశ్రాంతి తీసుకుంటూ ఉంటా. మీరు నాలుగుచోట్లూ తిరిగిరండి" అని వెనక దిగడింది పిల్లతో. అనంతరం ప్రేమాను తీసుకుని దేవాలయంలోకెళ్లి, మెడలో పసుపుకొమ్ము కట్టుకుని మంగళసూత్రము దేవుని కర్పించి ఓ నమస్కారం పెట్టింది.

అనుకున్న వేళకి మరునాటి మధ్యాహ్నానికి తల్లీ పిల్లా ఇంటికి చేరుకున్నారు, కొనుక్కున్న చందన బొమ్మలూ, ఇత్తడి సామగ్రీ పట్టుకుని.

౬

"ప్రేమూ, పడుకోవమ్మా పదిగంట లవొచ్చింది. జబ్బుకూడా అల్లా అల్లా మేలుకుని చదువుతే" అంటోంది సౌభాగ్యమ్మ.

"పగలు చదువుతే చాలమ్మా, రాత్రిళ్లు మేలుకు చదువక్కర్లేదు. కావలిసొస్తే ఇంకా తెల్లవారగట్లలేచి చదువు."

"మీకేం? ఊరికే 'పడుకో పడుకో' మని చంపుతారు. వాళ్ళ శారద ఎలాగ ప్రయత్నం చేస్తోందో తెలుసా ఫస్టుమార్కు కొట్టెయ్యడానికి? ఒక్కమాటైనా ఆప్షనల్స్‌లో ఫస్టుగా రావాలనుకుంటూంది... అవును కాని క్వాడ్రేటిక్ ఈక్వేషన్ ఇచ్చి దాని రూట్స్ ఈక్వల్ అన్న కండిషన్ ఇచ్చి, సీ వాల్యూ కనిపెట్టమన్నాడు. అప్పుడు సిస్క్వేర్ ఈస్ ఈక్వల్టూ ఫోర్ యేసీ అన్న పద్ధతిలోనేనా చెయ్యడం?"

పిల్ల అడుగుతూన్న విషయం తల్లికి తెలియలేదు. కాని ఆ విశాల నేత్రాలతో ప్రేమా, తండ్రి ఏమి చెప్తాడో అని ఆయన ముఖంకేసి చూస్తోంటే ప్రత్యక్షమవుతోన్న ఓ వింతసోయగాన్ని గమనిస్తూ సౌభాగ్యమ్మ నిలబడిపోయింది. లెక్క చెప్పేసి 'ఇంక పదురో' అంటూ పురుషోత్తం ఈవలకొచ్చాడు. పురుషోత్తాన్ని వెంబడించింది సౌభాగ్యమ్మ.

"ఏమండీ, ఊరికే ఇలా ఉపేక్ష చేస్తున్నారు? పిల్ల ఏరోజుకారోజు ఎదగడం చూడటంలేదూ?"

"అందులో ఆశ్చర్యమేముంది? పిల్లలు ఎదగరూ మరి?" అన్నాడు పురుషోత్తం టక్కరితనంగా.

"అందులో పెద్ద ఆశ్చర్యం ఉందని నే చెప్పటంలేను. చక్కని సంబంధం ఒకటి చూడవలసినకాలం వచ్చిందని చెప్తున్నా" అంది కొంచెం కోపాన్ని తెలియచేస్తూ.

"అంటే?"

సౌభాగ్యమ్మకి ప్రాణం విసిగింది. "అంటే? అంటారేమిటి? గోవగా ఎదిగింది పిల్ల రేపో ఎల్లుండో చటుక్కుని పెద్దదై ఊరుకుంటుంది."

"ఊరుకుంటుంది కాని మీదపడి కొట్టదుకదా నిన్ను? అల్లాగయితే, ప్రమాదమేమీ లేదుకదూ?" అన్నాడు పురుషోత్తం.

సౌభాగ్యమ్మ ఏమీ చెప్పలేక ఊరుకుంది. ఆఖరుకి "మీకేం తెలుస్తాయండీ ఆడదాని బాధలు? పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణసంకటం క్రింద ఉంది మన సంభాషణ. ఏంచెప్పినా వేళాకోళంకింద తోసేస్తేఎల్లాగ?" అంది. ఆ ముఖంలో ఉన్న దైన్యాన్ని కనిపెట్టాడు పురుషోత్తం. "ఎందుకే అనవసరం అయిన ఆదుర్దా? చక్కగా సరియైన ఉత్సాహంతో చదువుకుంటూంది. స్కూలుఫైనల్లోకి వచ్చింది. అల్లాంటి ప్రేమాకి 'పెళ్లి' అని చదువు చెడగొట్టడం ఏమిటి? 'పెద్దదైపోతుందేమో చటుక్కుని?' అన్న భయం ఎందుకూ? చెన్నపట్టణంలోకూడా ఎందుకూ ఈ భయాలు? సమర్తాడిన పిల్లల్ని ఎంతమందిని చూడడంలేదూ మనం పెళ్లి అవకుండా ఉన్న వాళ్ళని?" అన్నాడు.

"ఈ ఊళ్ళో పెళ్లికాకుండా పెద్దవాళ్ళయిన పిల్లలూ ఉన్నారు. వాళ్ళని పెళ్ళి చేసుకోడానికి సిద్ధంగా ఉన్నవాళ్ళూ ఉన్నారు. కాని మన

వాళ్ళలో ఎవరూ లేరు. మనకి మల్లేనే ఈ ఊళ్ళో స్థిరపడి ఉండిన మన వాళ్ల కుటుంబం ఏదైనా ఒకటుండి, వాళ్ళల్లో ఈడైన కుర్రవాడుంటే పెళ్లి పెద్దదయ్యాకే చెయ్యొచ్చు. కాని అల్లాంటివాళ్ళెవళ్ళూ లేరు. అందు చేత తొందరపడాలి."

"ప్రేమా బి. ఏ. ప్యాసవనియ్ చెపుతాను! దాని సౌందర్యం చదువూ చూసి, కళ్ళకద్దుకుని పెళ్లిచేసుకునేవాళ్లు లక్షమందున్నారు. మన శాఖలో కాకపోతే అన్యశాఖాయిరి"

ఆముక్కవిని అదిరిపడింది సౌభాగ్యమ్మ. "అంతశ్శాఖావివాహమే?"

పురుషోత్తం జందెం పారవెయ్యకపోయినా, బ్రహ్మసమాజం మీటింగుల కెళ్ళడం, యుక్తాయుక్తాలు లేకుండా 'పూర్వాచారం' అన్నమాత్రాన్ని మండిపడ్డం, బ్రాహ్మణేతరులతో విందులు గుడవడం—ఈ చేష్టలన్నీ సౌభాగ్యమ్మకి పరిచయమే. కాని ప్రేమా వివాహవిషయంలో వరాన్వేషణ అన్యశాఖలో జరుగబోతోందని ఆమె అనుకోలేదు.

అల్లాంటి వివాహం జరుగుతే! ఇంకేముంది? వెలి. 'వెలి' అంటే అంత పట్టింపులేనిమాట నిజమే—కాని వాళ్లు జానకి అక్కయ్యగాని, రామంగాని వస్తారా ఆ పెళ్ళికి? అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లే రాకపోతే ఇంక బంధువులమాట చెప్పక్కర్లేదు కదా. పోనీ ఎవరూ పెళ్ళీ పేరంటానికి రాకపోవచ్చు... కాని ఈ భావిదంపతుల మాటేమిటి? ఈ శాఖాసంకరంలో కలిగిన సంతానం మాటేమిటి? అప్పటికి శాఖలన్నీ కలసిపోతాయేమో? ఇంతకీ నిశ్చయంకాని భావికాలంమీద ఆధారపడి వర్తమానాన్ని ఉపేక్షచెయ్యడ మెందుకూ? ఇంతకూ అంత అవసరంలేందే ఎప్పటిదాకానో కనిపెట్టుకుని అప్పుడు అన్యశాఖలోంచి ఒకణ్ణి వెతికి తీసుకురావడానికి? బాల్యవివాహాలు నిషేధమే. కాని ప్రేమాకీ పద్ధానుగో ఏడు వెళ్ళిపోతోంది. అజ్ఞానికాకుండా చదువుకుంటూంది. చదువుకుంటూ, తగినవసతుండియ్యాకుకి తగిన కుర్రవాళ్ళు స్వశాఖలో ఎంతమందో ఉన్నారు. కనుక, ప్రేమాకి పెళ్ళిచెయ్యడం శ్రేయస్కరం ఇప్పుడు. ఇట్టి పరిస్థితుల్లో అన్యశాఖ కెందుకూ వెళ్ళడం. కేవలం 'మార్గదర్శకులవుదాం' అనే ఉద్దేశం ఉంటే తప్ప? స్వశాఖలో వరాభావం లేనప్పుడు మార్గదర్శకత్వం కోసం పాటుపడ్డం కొరవితో తలగోక్కోడం. దానివల్ల అనర్థాలు మెండుగా

ఉంటాయి. 'నేను సంస్కారిని' అనే అహంకారంతో కూడుకున్న ఉద్యమం ప్రేమా యొక్క భావిభాగ్యానికి హాని తేవచ్చు...

ఒకదానివెనుక ఒకటిగా ఆలోచనలు సౌభాగ్యమ్మ మనసులో పరుగెత్తేయి. ఇదంతా భర్త వింటున్నాడనే తోచిందామెకు. "కనుక నా మాట విని వాళ్లే చంద్రశేఖరానికిచ్చి చేసేద్దాం. పెళ్ళి" అన్నదామె.

"అబ్బ నాకు నిద్దరొస్తోంది. చంపకు" అన్నాడు పురుషోత్తం.

౨

ప్రేమా ఇంటర్మీడియట్‌లోకి వచ్చింది. యౌవన పుష్పం ఆమెలో వికసించింది.

స్వశాఖలో వివాహం కాకుండా ఉన్న యువకులందరికీ పెళ్లిళ్ళవుతున్నాయి. ఒక్కొక్క శుభలేఖ వచ్చి సౌభాగ్యమ్మ హృదయంలోని ఆశాలతలలో ఒక్కొక్కదాన్నీ నిర్మూలిస్తూంది. 'కొంచెం కాలం ఆగ'మని చంద్రశేఖరం తల్లికి రహస్యంగా ఓ ఉత్తరం వ్రాసింది. ఆఖరుకి ఆ పెళ్లి శుభలేఖకూడా చేరింది. అవును. అసలు అభిప్రాయాలేమిటో తెలియకుండా పురుషోత్తంమీద ఆధారపడి ఎంతకాలం ఆగుతారు వాళ్ళుమాత్రం?

సౌభాగ్యమ్మ ఏమిచేయగలదు? మగని కిష్టంలేని విషయాల్లో, తన మనస్సంతుష్టికోసం ఆచారవ్యవహారాల్లో కొంచెం స్వతంత్రించినా, ఆమె అతని మనస్సుకి కేవలం కష్టంతోచకుండా తన బుద్ధినైపుణ్యం చూపిస్తో గడుపుతోంది కాలం. కాని కూతురుపెళ్లి విషయంలో ఎటువంటి స్వతంత్రం తీసుకోగలదు? ధైర్యంచేసి స్వతంత్రించి చెయ్యడానికి, ఇదేమైనా ఆజ్యావీక్షణా, తిరుపతియాత్రా లాగ స్వల్పవిషయమా? ఇందులో తన బుద్ధినైపుణ్యం ఏమి కనుపర్చగలదు? వివాహ విషయంలో ఏమాత్రమైన స్వతంత్రం జూపినా తనకు శాశ్వతమైన ఎడబాటన్నమాట భర్తతో.

తన భర్తకే 'సంఘ సంస్కారి' అని అనిపించుకోవాలనే ఈ కోరిక ఏమిటో? సంఘంలో మంచివరుడు లేక పిల్లని ఏ వృద్ధునికో, ఏ దౌర్భాగ్యుడికో ఇచ్చి కట్టిపెట్టవలసొచ్చినప్పుడు, త్యాగం చూపించి, సంస్కారి కావలసినదే. అవసరం లేనప్పుడెందుకూ సంస్కారం? ఆయన, తిరుపతిలో అయిన పెళ్లి పువ్వుల దండలతోటి, ప్రార్థనలతోటి జరిగిందని, అది చాలా

ష్టంగా ఉందనీ, ఎన్నిమాట్లో అభినందించారు. మంత్రాలుమాత్రం ప్రార్థనలు కావూ? ఈ పెళ్లిలోమాత్రం తంతు ఏమి తగ్గిందీ?...

ఇల్లాంటి ఆలోచనలతో నిండిన మనస్సుతో ఒకనాడు సౌభాగ్యమ్మ గుమ్మందగ్గర, లోపల చదువుకుంటూన్న ప్రేమూను చూస్తూ నిలబడింది.

ప్రేమూ "అమ్మా, ఏమిటే అల్లాగ చూస్తున్నావు?" అంది. ఏమి చెప్పటానికీ తోచక, "ఊరికేనే, ఏమీలేదు" అంది తల్లి.

"నాకు ఈ తెలుగో పెద్దబాధయిపోయిందమ్మా. కాన్వెంటులో అరవ మేష్టరు తెలుగు చెప్పడంచేత అశ్రద్ధచేశా ఈ సబ్జక్టు. కాలేజీలో కంపల్సరీ అయిపోయింది. అంటే, ఇందులో మార్కులు సరిగ్గా రాకపోతే ఉంచేస్తారన్నమాట."

"ఏదీ, నేనేమైనా చెప్పగలనేమో చూద్దాం. అడుగు నీకేం కావాలో" అంది సౌభాగ్యమ్మ ప్రేమూ దగ్గరకు వెళ్లి.

ప్రేమూ తెలుగు సెలక్షన్సు ముందు పడవేసింది. "ఈ పద్యాన్నీ, ఈ పద్యాన్నీ కంపేర్ చేస్తూ కామెంటు వ్రాయాలిట. అంటే పోలిక చూపిస్తూ వ్యాఖ్యానం వ్రాయమన్నమాట" అంది ప్రేమూ.

ఆ రెండు పద్యాలూ చదివింది సౌభాగ్యమ్మ. "అమ్మాయీ, మొదట నే చెప్పినది వినేసి, నువ్వు ఎలాగ వ్రాసుకుంటే మార్కులొస్తాయో ఆలోచించుకుని ఆ ఫక్కీతో వ్రాసుకో... మొదటి పద్యం చూడు. ఇది ప్రహ్లాదుడన్నది. 'భగవంతుడు సర్వాంతర్యామి' అని తండ్రికి చెపుతున్నాడు. 'ఇందుగల డందులేడని సందేహము వలదు' అంటున్నాడు. ప్రహ్లాదుడు మహాభక్తుడు. తల్లి గర్భంలో ఉన్నప్పుడే విష్ణుభక్తి కుదిరిన దాతనికి. అందుచేత భగవంతుడున్నాడా లేడా అనే సందేహం ఎన్నడూ లేదు. 'భగవంతుడు సకల చరాచరాంతర్యామి' అన్న మనోనిశ్చయం అతనికి ఉండడంచేత 'చక్రి సర్వోపగతుడు' అని నిక్కచ్చిగా చెప్పేశాడు. 'రెండవ పద్యం చూడు' ఇది గజేంద్రుడు చెప్పినది. ఈతడూ భక్తుడే. కాని ప్రహ్లాదునివంటి భక్తుడు కాడతడు. మొసలిచేత పీడింపబడుతూ కొన్ని సంవత్సరాలు దానితో యుద్ధంచేసి అప్పుడు భగవంతుడే రక్షించాలనుకుని ప్రార్థన మొదలెడతాడు. భగవంతుని స్వరూపం ఎల్లాంటిదో గజేంద్రునికి ప్రహ్లాదునికి తెలిసినట్లు తెలియదు. అతని జ్ఞానం అంతా వినికిడిమీద ఆధార

పడి ఉంది. అందుచేతనే 'కలడందురు దీనులయెడ' అన్నాడు. 'దీనుల యెడల ఉన్నాడు భగవంతుడు' అని చెప్పలేదాతడు. 'దీనుల యెడల ఉన్నాడంటారు" అన్నాడు అతడు. 'భగవంతుడున్నాడు' అని నొక్కి చెప్పలేదు. ఏడిచి ఏడిచి, భగవంతుడు ఎప్పటికీ రాకపోతే, ఆఖరుకి 'ఆ, కలడు కలండనెడివాడు కలడో లేడో' అనే అనుమానంలోకికూడా దిగాడు. ప్రహ్లాదుడికి మాత్రం ఇల్లాంటి అనుమానాలు ఎప్పుడూ లేవు... తెలిసిందా?". అంది సౌభాగ్యమ్మ.

ప్రేమా వింటూ అమ్మ కేసి చూస్తోంది. అమ్మ పరవశురాలయి చెబుతోంది. 'అమ్మ, అనెమ్యు కేటెడ్, అంటా డెందుచేతో నాన్న?' అనుకుంటూ ఆశ్చర్యపోయింది ప్రేమా

ఇంతట్లో పురుషోత్తం వచ్చాడు. "ప్రేమా, లేడీ వెల్లింగ్డన్ ఎస్సే కాంపిటీషన్ రిజల్టు తెలిసిందా?" అని అడిగాడు ఆయన.

"లేదింకా? అందరూ ప్రైజు నాకే వస్తుందనుకుంటున్నారు... నాన్నా! ఒకటడుగుదాం అని మరచిపోతున్నా. మా క్లబ్బువాళ్ళంతా టెన్నిస్ సింగిల్సుకు నన్ను పంపుతానంటున్నారు. కంపీట్ చెయ్యమంటావా?"

"తప్పకుండా వెళ్ళు. నన్నడిగేదేమిటి?" అన్నాడు.

౨

ఇంటర్మీడియట్ క్లాసు చదవడం అయిపోయింది. ప్రేమా పురుషోత్తంతో బి. ఏ. చదవనని చెప్పింది. "మెడిసిన్" చదవాలని ఆమె కోర్కె.

"మెడికల్ పరీక్ష చాలా కష్టంకాదా?" అన్నాడతడు.

"ఇంటర్లో సెకండు గ్రూప్‌లోకి మార్చెయ్యడంలో ఉద్దేశం మెడిసిన్ చదువుదామనేగా?"

"అయిదేళ్ళకోర్సు. చాలా కాలం పడుతుంది."

"అయిదేళ్ళ కోర్సూ అయిదేళ్లకంటే ఎక్కువ పట్టదుకదా?" అంది నవ్వుతూ ప్రేమ.

పురుషోత్తం ఏమీ చెప్పలేదు. బి. ఏ, రెండేళ్లలో పూర్తిచేస్తే, ప్రేమూకు పెళ్లి చెయ్యవచ్చు అనుకున్నాడు. "రెండేళ్ళకంటే ఆలస్యం చెయ్యడం ఎందుకూ?" అని ఉద్దేశపడ్డాడు. అందుకే చాలాకాలం పడు తుందన్నాడు. కాని తన ఉద్దేశం ప్రేమూకి తెలియనిచ్చాడు కాదు. కొంచెం సేపుండి "సరే" అన్నాడు. తండ్రి ఏదో ఆలోచిస్తున్నాడని తెలుసుకుంది ప్రేమ. "పోనీ, నీయిష్టం. బి. ఏ చదవమంటే బి ఏ. చదువుతా!" అంది. "ఎందుకూ? వద్దు. మెడిసినే చదువు" అన్నాడు. "ప్రేమూ ఇచ్చకి ఎందుకూ అడ్డురావడం? దాని ఇష్టముచ్చినదే చదువుతుంది. పెళ్లి కేం? ఇంకో కొంతకాలం ఆలస్యమవుతుంది—అంతేగా?" అనుకున్నాడు పురుషోత్తం.

౯

'హిందూ' మడతవిప్పి పేజీలు తిరగేస్తున్నాడు. పురుషోత్తం. అందులోఉన్న ఓ ఫోటోమీద దృష్టి సారిస్తూ, "భాగ్యం" అని పిలిచాడు. సౌభాగ్యమ్మ వచ్చింది. "ప్రేమూబొమ్మ పడింది చూశావా?"

టెన్నిస్ రేకెట్టు చేతపుచ్చుకుని ప్రేమూ కుర్చీలో కూర్చుని ఉంది ఆ బొమ్మలో. ప్రక్కనే ఓ యువకుడు నిలబడి ఉన్నాడు. వారిద్దరి మధ్యనూ వెండికప్పు ఉంది.

"ప్రేమూ, ఇతడూ ఓ పక్షంలో ఉండి నెగ్గేరుట ఈ పందెం!"

"ఎవరండీ ఇతను?"

"ఇందులో 'కోదండపాణి' అని ఉంది. ఇతన్ని గురించి ఎప్పుడో ప్రేమూ చెప్పినట్లు జ్ఞాపకం?... ప్రేమూ సరిగ్గా నీ పోలికేసుమా! చిన్నప్పుడు నువ్వు ఇలాగే ఉండేదానవు. డ్రెస్సులో తేడాతప్ప, ఇంకేభేదం అగుపడదు."

సౌభాగ్యమ్మ లోపలికెళ్లి, తను ఆ ఈడప్పుడు తీయించుకున్న ఫోటో తీసుకొచ్చింది. తన ఫోటోకీ ప్రేమూ ఫోటోకీ వ్యత్యాసం అట్టేలేదు...ఆ ఫోటోలో సౌభాగ్యమ్మ రెండేళ్ల వయస్సుగల ప్రేమూను ఒడిలో కూర్చో పెట్టుకొని ఉంది. సౌభాగ్యమ్మ ఫోటోలు రెండూ ఒకదాని ప్రక్క ఒకటి పెట్టి, "ఏమండీ ప్రేమూ పెళ్లిచేసుకుంటే ఈపాటికి బిడ్డలతల్లి కావలసిందే" అంది.

పురుషోత్తం ఏమీ మాట్లాడలేదు. సౌభాగ్యమ్మ ఏదో చెప్ప బోయింది. అంతలో జోడు చప్పుడయింది. లోపల ప్రవేశించే ప్రేమాని చూచి ఆమె మాట్లాడక ఊరుకుంది.

"అమ్మాయీ, కోదండపాణి ఎవరే?"

"శివజ్ఞానం పిళ్ళెకొడుకు. ఇదివరకు చెప్పలేదూ నీకు సింగిల్సుకి కంపీట్ చేసినప్పుడు?"

"శివజ్ఞానంపిళ్ళె అంటే ఇద్దరున్నారు. పోలీస్ ఆఫీసరుగా ఉండడూ..."

"అబ్బే' అతనుకాదండి. క్రౌనుప్రాసిక్యూటరు శివజ్ఞానంపిళ్ళె."

"అత నేమిటి లా స్టూడెంటా?"

"కాదు. మాక్లాసే. చాలా తెలివైనవాడులే. అన్ని సబ్జెక్ట్సులోనూ కూడా స్పెషలిస్టే. ఇంక టెన్నిస్‌లో చెప్ప నక్కరలేదు. మంచి 'గ్రేస్' చూపిస్తాడు ఆటలో."

"నీతో సింగిల్సుఆడి 'డిఫీటు' అవుత ఇతనేకదూ?"

"అవును...దాని కేమిలే! ఆవేళ ఎందుచేతో పాడుచేశాడుకాని, నెగ్గవలసినవాడే అప్పుడుకూడా... అన్నట్లు మరచిపోయా. రేపు బహుశః మనింటి కొస్తాడాయన. 'ఫ్రెండ్సు' అందరికీ చిన్నటీపార్టీ ఒకటి 'అరేంజి' చేస్తున్నాడు. పెర్సనల్‌గావచ్చి ఇన్వైట్ చేస్తానన్నాడు నిన్ను. బహుశః రెండు గంటలకి రావొచ్చు."

౧౦

కోదండపాణి మర్నాడు అనుకున్నవేళకి పురుషోత్తంగారింటి కొచ్చాడు. ప్రేమా తండ్రికీ, సహాధ్యాయుడికీ ప్రథమ పరచయం కలుగ చేసింది. టెన్నిస్‌లో జయముపొందినందుకు కోదండపాణిని అభినందించాడు పురుషోత్తం.

"మిస్ ప్రేమాదేనండీ ఆటఅంతా. నేను ఊరికే అక్కడ నిలబడ్డాను. మీరు మొన్న రాలేదనుకుంటా. వచ్చి ఉంటే మీకే తెలుసు." అని ఇంగ్లీషునే మాట్లాడ్డం మొదలుపెట్టేడు కోదండపాణి.

"ఏమిటిటోనండి! నాకు ఎప్పటికప్పుడే కుదరటంలేదు. సెక్రటరియట్‌లోంచి ఊడిపడేటప్పటికి ఆరుకూడా అయిపోతుంది ఒకొక్కప్పుడు."

"అవునండి, అలాగే ఉంటుంది. ఒక ఆఫీసుకు హెడ్ అవుతే అంతే కాదూ."

"మా ప్రేమూ చెపుతోంటే వినడమే కాని మిమ్మల్ని ఎప్పుడూ చూడనేలేదండీ."

"తమర్ని నేను సమాజ్ హాలులో ఎప్పుడూ చూస్తూనే ఉన్నా. మీరు 'ఫలనా' అని కూడా తెలుసు. మిస్ ప్రేమూయే చూపించింది నాకు మొదట... నేడు చాలా సుదినం, మీతో మాట్లాడ్డానికి వీలయింది."

ఇంకా ఏమైన టోర్నమెంట్సుకి కడతారా?"

"కడదామనే ఉంది. మిస్ ప్రేమూ కంపేనియన్‌గా ఉంటే మాకెప్పుడూ దిగ్విజయమే!"

ముసిముసినవ్వు నవ్వేడు పురుషోత్తం.

"మిస్ ప్రేమూలాంటి కూతుర్ని కన్న తలిదండ్రులజన్మ సార్థకం. కాలేజీలోనూ, టెన్నిస్ కోర్టులోనూకూడా సమానమైన ప్రతిభ చూపిస్తోంది."

"అబ్బ! ఊరుకోవోయ్. ఉన్నవీ లేనివీ అల్లాకల్పించి చెప్పకపోతే ఏమీ?" అంది ప్రేమూ.

సౌభాగ్యమ్మ పట్టుకువస్తున్న 'టీ'ని, ప్రేమూఅందుకుని టీపాయిమీద పెట్టింది. 'టీ' త్రాగి కోదండపాణి తానియ్యబోయే టీపార్టీకి పురుషోత్తమాన్ని ఆహ్వానించి, వెడుతూ, ప్రేమూకేసి చూస్తో "నువ్వు కూడా రావాలన్నమాటే సుమా" అన్నాడు. నవ్వుతో.

"అల్లాగా, నాకు తెలియదే" అంది ప్రేమూ.

పురుషోత్తంకూడా నవ్వాడు.

౧౧

ప్రేమూ, కోదండపాణీకూడా పరీక్షలు ప్యాసవుతున్నారు. టెన్నిస్ కప్పులు నెగ్గుతూనే ఉన్నారు. వాళ్ళిద్దరికీ యమ్. బి. బి. ఎస్. డిగ్రీలు వచ్చాయి.

'ఇంక పెళ్ళి చెయ్యాలి' అనుకున్నాడు పురుషోత్తం 'ఇంక ఆలస్యం చేస్తే భాగ్యం బెంగకూడా పెట్టుకుంటుంది.' అమ్మాయితో ఆ ప్రశంస

ఎల్లాగ తీసుకురావాలో రెండుమూడురోజులు ఆలోచించి పురుషోత్తం ఒకనాటి ఉదయాన్ని "ప్రేమా" అన్నాడు.

"ఏమిటి నాన్నా ?"

"ఏమీలేదు...నీ పెళ్ళి సంగతి గురించి మాట్లాడుదామనుకుంటున్నా..." రెండురోజుల్నించి అతని మనస్సులో రాపాడుతోన్న చివరికి పురుషోత్తం, ఆ ప్రశంస తీసుకురావడంలో సమర్థత చూపలేకపోయాడు.

"అవును నేనే తొందరపడవద్దని ఆపుచేశా, పరీక్షలేవో తెమిలిపోతే మంచిదని. లేకపోతే ఇదివరకే అతడొచ్చి నీతో ఈ సంగతిని గురించి మాట్లాడి ఉండును" అంది ప్రేమ రాకెట్టులో తెగిన స్ప్రింగుతీసి కొత్తది వేయబోతూ.

"అతడెవరు ?"

ప్రేమా తండ్రికేసి చూసింది. ఆ ముఖంలో ఆశ్చర్యం అగుపిస్తోంది. నాన్న తెలియనివాడిలా నటిస్తున్నాడు తనచేత చెప్పించాలని అతని ఉద్దేశం. సహజమైన సిగ్గుతో దృష్టిని రాకెట్టుమీదకు దింపి "కోదండపాణి" అంది ప్రేమా.

"కోదండపాణి!" అనే ముక్క వెలువడింది. ప్రేమా అదిరిపడి తండ్రికేసి చూసింది. పురుషోత్తం ముఖం వంచుకుని స్తంభితుడై కూర్చునే ఉన్నాడు. ప్రేమాకి ఏమీ అర్థమవటంలేదు.

పురుషోత్తం లేచి పైకివెళ్ళాడు. మేడమీద గదిని కడిగిస్తోంది సౌభాగ్యమ్మ. 'భాగ్యం, ప్రేమా కొంపతీసింది. కోదండపాణిని పెళ్ళి చేసుకుంటుందిట !" అన్నాడు పురుషోత్తం.

గడచిన ఎనిమిది సంవత్సరాలలోనూ సౌభాగ్యమ్మ ఏదో సందర్భంలో కూతురి వివాహాన్ని గురించి తలవని రోజులేదు. గడచిన ప్రతిరోజూ ఆమెను సంఘాన్నించి దూరం చేస్తూంది. దీర్ఘకాలంనుంచి ఆ మనస్సులో మెలగుతోఉన్న ఆ తలంపు ఆ మనస్సుని వాద ప్రతివాదాల్లోకి దింపి వేసింది. విమర్శమీద విమర్శలు నడిచేయి ఆ మనస్సులో. అల్లాంటి సమయాల్లో ఏమీ తోచక తుదకు విధాతృవిధానం ఎల్లాఉందో ! అని సమాధాన పరచుకుని ఊరుకునేది. నేడు భర్త నోటమ్మట వెలువడిన వాక్యం ఆమె కాందోళన తీసుకురాలేదు. ఒక్కక్షణం కళ్లు మూసుకుని "విధాతృవిధానం

ఎల్లాఉంటారో !" అనుకుంది. కళ్ళు తెరచి పురుషోత్తం కేసి చూసింది ఆమె.
"ఎందుకండీ, అంత గాభరాపడడం ? చూడొచ్చులెండి. ఆఫీసువేళవుతోంది స్నానానికి లెండి" అంది అతి సౌశీల్యంగా. దంపతుల దృష్టులు మెట్లమీదికి తిరిగేయి. ప్రేమా అక్కడ నిలబడిఉంది.

పురుషోత్తం రెండు మెతుకులు కలికి, ఆఫీసుకు వెళ్ళేడు. తల్లీ, కూతురు భోజనానికి కూర్చున్నారు ప్రేమ "అమ్మా !" అంది. "భోజనం చెయ్యి, తరువాత మాట్లాడుకోవచ్చు" అని సౌభాగ్యమ్మ ప్రేమాని మాట్లాడ నివ్వలేదు.

భోజనాంతరం, "ఇదుగో, అదుగో" అని సౌభాగ్యమ్మ రెండు ఘంటల ఆలస్యం చేసింది. ప్రేమా గదిలోనే కూర్చుని 'అమ్మా' అని పిలిచింది. ఆ అందమయిన ముఖంలో నేడో వన్నె తగ్గింది.

"అమ్మా !"

"ఏమమ్మా !"

నే తెలియజేసిన విషయం నాన్న హృదయానికి దారుణాఘాతం అయింది కాదూ ?"

"అబ్బే, ఏమీ లేదు. నువ్వాలేటే ఆలోచించకు. దాని విషయం నాన్న వచ్చేక మాట్లాడుకోవచ్చు."

ప్రేమా దగ్గరగా వచ్చింది. తల్లి మెడమీదనుంచి చెయ్యి రానిచ్చి రెండవ చేతితో ఆమె ముఖాన్ని దగ్గరకు లాక్కొని "అమ్మా, నాన్న ఆఫీసుకు వెళ్ళిపోతూ నాకేసి చూచినప్పుడు ఆ ముఖాన్ని నే నెప్పుడూ ఇది వరకు చూడని విషాదం అగుపడింది...అమ్మా ! నాన్నకి నామీదఉండే ప్రేమ అగాధమయింది, నా ఇచ్ఛకి ఎప్పుడూ నాన్న అడ్డుగాలేదు. చదువు చెప్పించాడు. నా బుద్ధి ఎటునడుస్తోందంటే అటు నడువనిచ్చాడు. క్లబ్బులో మెంబరుగా జేరనిచ్చాడు. టెన్నిస్ పందేలకు కట్టనిచ్చాడు. నా కోసం ఎంతో ధనం ఖర్చుపెట్టాడు. నన్ను నాటకాలకి, సినిమాలకి, టీ పార్టీలకి, మీటింగులకి తీసుకెళ్ళాడు...నన్ను గాఢంగా ప్రేమించకపోతే నాన్న ఇన్ని విధాల నన్నెందుకు చూస్తాడు ? నేనేమి చెప్పినాకూడా 'అవును నువ్వు సరిగ్గానే ఆలోచించావు' అనేవాడు...ఈ ప్రేమకు నేడు విచ్ఛిత్తి వచ్చింది కాబోలు !"

ప్రేమా కళ్లల్లోంచి, రెండు వేడిచుక్కలు రాలి, తల్లి చేతిమీద పడ్డాయి. కళాశాల పరీక్షల్లో అలజడిలేని హృదయంతో సమాధానములు వ్రాయగలిగిన ఆ ప్రేమా, మెడికల్ కాలేజీలో తత్తరపాటు లేకుండా మృతకళేబరాలను కోయుటకు అలవాటుపడ్డ ఆ ప్రేమా, టెన్నిస్‌కోర్టులో పురుషులతో హోరాహోరీగా పోరి పందెములు నెగ్గిన ప్రేమా, ఇరువదేండ్ల వయసుగల ప్రేమా నేడు తల్లి ఒడిలో కూర్చుని ఒక బాలికలాగ ఏడవడం మొదలుపెట్టింది.

ఆమె కంటినీరు ఒత్తుతూ సౌభాగ్యమ్మ "అమ్మాయీ, వెర్రి ఎత్తిం దేమిటే నీకు? మీ నాన్నకి నీమీద ఉండే ప్రేమలో ఎప్పుడూ విచ్ఛిత్తి రాదు. వివాహం అన్ని విషయాలకంటే కొంచెం ఆలోచించవలసినది కనుక, ఆయనకూడా ఆలోచిస్తున్నారు...'మనం బ్రాహ్మలం. ఆంధ్రులం. వాళ్లు అరవదేశస్థులలో శూద్రులు. అందుచేత మనకీ వాళ్ళకీ వివాహం కుదురుతుందా?' అని నాన్నగారు ఆలోచిస్తున్నట్లున్నారు అంతే."

"అమ్మా, నాన్న నిజంగా అలాగ ఆలోచిస్తాడంటావా? మేము వెళ్లిన మీటింగులన్నింటిలోనూ ఇల్లాంటివి పాటించకూడదని చెప్పేవారు. నాన్న చదివే పుస్తకాల్లో వర్ణాశ్రమధర్మాలు ప్రస్తుతం వ్యక్తియొక్క స్వాతంత్ర్యాన్ని అడ్డుపెట్టే, పెట్టని గోడలనికదూ వుంది? మేము వెళ్ళిన డిన్నర్లలో వర్ణాలు పాటించకుండా కలిసియే భోజనం చేశాము. మనింట్లో కూడా వర్ణం పాటించకుండానే కాదూ డిన్నర్లిస్తే? కనుక నాన్నకి ఇల్లాంటి అభ్యంతరం వస్తుందంటావా నా వివాహ విషయంలో?"

అతిమార్దవంతో, మనస్సులో ఉన్న దున్నట్లు వెలిబుచ్చుతోంది. ప్రేమా, ఆమెకు హిందూమతంలో ఉన్న దురాచారాలు తప్ప ఆ మతాన్ని గురించి ఏమీ తెలియదు. చదువు, ఆటలతో ఇన్నాళ్ళు కాలం గడిపింది గనుక, సంసారానుభవం కూడా తక్కువ. 'అరవదేశపు బ్రాహ్మణేతరుణ్ణి వివాహమాడితే, ఏమైనా బాధలుంటాయా' అనే తలపు ఆమెను ప్రవేశించలేదు.

సౌభాగ్యమ్మ, కూతురు యుక్తాయుక్తాలు తెలియకుండా మాట్లాడుతోందని అనుకోలేదు. ఆమె అతి సౌమ్యంతో 'అమ్మాయీ, వివాహవిషయం తక్కిన విషయాలన్నిటికంటే బాగుగా ఆలోచించవలసినది కనుక పోనీ నాన్నతో ఇదివరలోనే సలహాచెయ్యలేక పోయావా?"

"అమ్మా! 'వివాహం' అనే తలపు నా మనస్సులో మొదట రానే లేదు. అతడు, ఫస్టుమార్కొచ్చిన పేపరు పుచ్చుకొని, తక్కిన స్టూడెంట్సు మెచ్చుకొనే ముఖాలతో చూస్తోంటే, చిరునవ్వు ముఖంతో నవ్వుతున్నప్పుడు అతనిలో ఒక సొంపు అగపడేది నాకు. అతను టెన్నిస్ ఆటలో ఒక విధమయిన 'గ్రేస్' ప్రస్ఫుటమయ్యేది నా కళ్ళకి. అతన్ని 'నే ప్రేమిస్తున్నా' అని నేనెన్నడూ అనుకోలేదు మొదట. కాని క్రమంగా 'వివాహం చేసుకోవాలి సుమా కూడదా' అనే తలపు మనస్సులో ప్రవేశించినప్పుడు, నాకు సహచరుడుగా ఉండవలసినవాడు అతడే అనుకున్నా" అంది ప్రేమా.

తన లోపల ఉన్నటువంటి ఆవేదన పొంగి హృదయాన్ని చీల్చుకుని భౌతికరూపంలో బయటకొస్తోందేమో అనిపించింది సౌభాగ్యమ్మకి. ఆ బాధను ఆపుకోడం కష్టమనితోచి "ఉండమ్మా! లే! కుంపట్లో నిప్పువేస్తా కాఫీకి" అంటూ నెమ్మదిగా లేచి వెళ్ళిపోయింది సౌభాగ్యమ్మ.

నాడు కాఫీ రుచించలేదు ప్రేమాకి. నాలుగు ఘంటలయింది 'క్లబ్బు'కని బయలుదేరి వెళ్ళింది ఆమె.

క్లబ్బులో ఏమీ తోచలేదు. తండ్రి ఆఫీసులోనే ఉంటాడు కదా ఇంకా అనుకొని ఆమె చెపాక్ దగ్గర బస్ దిగి సెక్రటేరియట్ ఆఫీసుకేసి వెళ్ళింది.

సముద్రపు టొడ్డున కూర్చుని పురుషోత్తం, కూతురూ చాలాసేపు మాటాడుకున్నారు. పురుషోత్తం బ్రహ్మసమాజం అంటే అభిమానమున్నవాడే. కాని వేషభాషల్లో, నడవడికలో, ఆహారంలోనూ కూడా పూర్తిగా తమతో సంబంధంలేని ఒకణ్ణి ప్రేమా వివాహం చేసుకోవడం వెగటుగా అనిపిస్తోంది. అతడు అటువంటి వివాహానికి తన సమ్మతిని చూపలేదు. తన అసమ్మతికి కారణంకూడా చెప్పను. చెప్పలేదు.

అన్ని సందర్భాలలోనూ తనతో ఏకీభవించిన తండ్రి తన వివాహ విషయంలో అభిప్రాయభేదం కనుపరచాడు. తన క్షేమం కోసం పాటుపడే తండ్రితో, తాను తలపెట్టిన వివాహం ఉచితమే అనికాని, కోదండపాణిని తప్ప అన్యుని తన మనస్సును స్వీకరించవద్దని కాని ప్రేమా చెప్పదలచుకోలేదు. తండ్రిమనస్సు కామె ఈవరలో ఎప్పుడూ కష్టం కలుగజెయ్యలేదు. అతడు తన్ను అతి గారాబంగా పెంచాడు. ఇప్పుడా హృదయానికి బాధ కలిగించడం మహాకృతఘ్నత.

కాని తన హృదయంలో అచ్చొత్తింపబడ్డ కోదండపాణి చిత్తరువును చెరిపివేయటం ఎట్లు? అతని ఆశలన్నీ భగ్నమయాయని అతనికి తెలియజేయడం ఎట్లు? ఈ ప్రశ్నలకి సమాధానాలు ఆమెకు సులభంగా గోచరిస్తాయని తోచలేదు.

౧౨

రెండు మూడు నెలలు గడిచాయి. కోదండపాణి పురుషోత్తంఇంటికి ఒక పర్యాయం వచ్చాడు. మళ్ళీ అతడగుపించలేదు.

ఒకనాడు పురుషోత్తం "భాగ్యం, ప్రేమా పెళ్లిమాట ఏమిటి ?" అన్నాడు.

"ప్రస్తుత పరిస్థితుల్లో కోదండపాణికిచ్చి వివాహం చేయడం యుక్తం" అంది సౌభాగ్యమ్మ.

'అది వెటకారమా ?' పురుషోత్తం, భార్యకేసి చూశాడు. ఆవాక్యం ఆమెనుండి మనస్ఫూర్తిగా వెలువడిందే! ఆమెలో వచ్చిన ఆ మార్పున కాతడాశ్చర్యపోయాడు.

ఆ పరిస్థితులలో సౌభాగ్యమ్మ పురుషోత్తమానికి తెలియచెప్పింది. పురుషోత్తమానికి ఏమీ తోచలేదు.

ఒకరోజు ఆలోచించాడు, ఏమీ తోచలేదు. రెండవ దినం అంతా ఆలోచించాడు. అతనికి కర్తవ్యం స్ఫురించలేదు. ఆఖరుకి "భాగ్యం, ఏమంటావ్ ?" అన్నాడు. "అంతకంటే మార్గం నాకగపడటంలేదు." అంది సౌభాగ్యమ్మ.

పురుషోత్తం ప్రేమా ఉన్న గదిలోకి వెళ్ళాడు. "అమ్మా, కోదండపాణి రావడంలేదేమో, మనింటికి ? రావద్దని చెప్పినట్టున్నావు కదూ ?" అన్నాడు, ప్రసంగం ఎలాగ ప్రారంభించాలో తెలియక, ఆఖరుకి.

"అతడప్పుడే నెలాపదిహేను రోజులు క్రిందటే ఇంగ్లండెళ్లిపోయాడు పేపర్లో పడినట్లుగాఉందే. నీకు తెలియదూ ?"

"అలాగా ? ఎందుకూ వెడత ?"

"ఇంకా చదువుదామనే"

"ఇదివరకెప్పుడూ చెప్పలేదే మనతో !"

"హఠాత్తుగా పుట్టిందనుకుంటూ ఈ తలపు"

పురుషోత్తమానికి ఏమిచెప్పాలో తోచిందకాదు. కొంతసేపూరుకొండి, గద్గదస్వరంతో "అమ్మా. ఏదో పెట్టిఉద్దేశాలతో నీ స్వతంత్రానికి కడ్డు వచ్చాను. కోదండపాణికి 'కేబుల్' ఇచ్చి వచ్చేయ్యమను. మీరిద్దరూ వివాహం చేసుకుని, ఇష్టమవుతే ఇద్దరూకలసి ఇంగ్లండు వెళ్ళవచ్చు." అన్నాడు.

"నాన్నా, ఏదో సమయంలో 'పరిణయం' అనే తలపు వుద్భవ మయింది కాని, ఆలోచించి చూస్తే, దానివల్ల అనర్థాలు ఎక్కువని తోచాయి. ఎంతో చురుకుగా, ఉత్సాహంతో ఉన్న మిస్ సదాశివన్ పెళ్లి చేసుకున్న పిమ్మట, "ఏమమ్మా, ఇల్లాగున్నావేమిటి ?" అని అడుగుతే, సంసారంలో ఉండే పరిస్థితులు మీకు తెలియవు" అంది అతి దీనంగా... నే నొక్కర్తనే కదా మీకు? నే తక్క మీకు బిడ్డలు గలుగలేదు నన్నతి గారాబంతో పెంచారు. వృద్ధాప్యంలో మీకు సేవ చెయ్యవలసిన భారం నాది. అందుచేత పెళ్లి చేసుకోకుండా ఉంటే..."

పురుషోత్తం అడ్డొచ్చాడామె మాటకు. "చదువు పూర్తిఅయాక వివాహం చేసుకుంటానని ఉపేక్ష చేశాను. కాని ఇల్లాంటి మాటలు వింటానను కోలేదు. కోదండపాణిని పెళ్లిచేసుకుంటా నన్నదానవు ఇంతలో మనస్సులో మార్చుకోడం ఎందుకూ? నీ స్వతంత్రానికడ్డురాను. నాకు మీ వివాహం సమ్మతమే. నేనిది మనస్ఫూర్తిగా చెపుతూన్నమాటే..."

"నాన్నా, చదువు పూర్తి అయిందంటావు. చదువుకి పూర్తి అవడం అంటూ ఉందా ఎప్పుడేనా ? 'స్వతంత్రానికడ్డురాను' అంటున్నావు. కాని నేను అవివాహితను గానే ఉంటె నాకు స్వతంత్రం ఎక్కువకాదా ? ...ఎల్లాగ జీవితం గడుపుతానో నేనని ఒకబాధ నీ కుండవచ్చు. మెడిసన్ చదువుతున్నదాన్ని కనుక, బీదల కుచితంగా వైద్యం చేస్తా...నిన్నూ అమ్మనీ నేను వదలి ఉండను...ఉండలేను కూడాను"

ప్రేమా అప్రయత్నంగా ఎదురుగుండా ఉన్న గోడకేసి చూసింది. వ్రేలాడుతూన్న టెన్నిస్ రేకెట్ ఆమెకు గోచరమైంది. ఆనాడు ఆమెచే తీసివేయబడ్డ తెగిన 'స్ట్రింగు'కు మారుగా కొత్త స్ట్రింగు పడకపోవుటచే ఆ భాగం వెలితిగానే అగుపిస్తోంది.

పురుషోత్తం నిట్టూర్పు విడిచాడు. వెనక్కి తిరిగాడు, సౌభాగ్యమ్మ వంటింట్లోంచి వస్తోంది. ఆమె ముఖాన్ని చూడ్డానికాతనికి సిగ్గయింది. "ప్రేమూ మూర్తీభవించిన మా అన్యోన్యరాగం అనుకున్నా. కాని చివరకు ఆమె నా అవివేకాన్ని ప్రతిబింబింపజేసే అద్దం అయింది. బ్రహ్మచారిణి అయివున్న కూతుర్ని చూస్తోన్న కొద్దీ సౌభాగ్యానికి రోతపుట్టక మానదు. నేనంటే... అయ్యో! ప్రేమూ యొక్క మనస్సు ఎంత త్వరలో మారిపోయింది! అవును ఏముంది! పొంగుతూన్న పాలకి ఒక్క ఉప్పురాయి చాలుగా, విరిగిపోవడానికి" అనుకున్నాడు.

తనకు కష్టజీవితం నాటితో ప్రారంభమవుతోన్నట్టుగా తోచిందాతనికి.